క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ ఫేస్–1లోని శ్రీదేవి పోచమ్మ, దాసాంజనేయ, శ్రీ కాశీవిశ్వనాథ స్వామి వార్ల ఆలయ ధ్వజ స్తంభం, అమ్మవారి సింహవాహన యంత్ర ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... ఆలయాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పురుషోత్తంరెడ్డి, సాయిబాబు, భిక్షపతి, నాయకులు రఘురామ్, మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో చల్లబడిన వాతావరణం



ఆనంద్‌నగర్‌లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

నాగోలు: నగరంలో కురిసిన వర్షంతో నగరంలో వాతవారణం చల్లబడింది. ఎల్‌బీనగర్ పరిధిలో గురువారం రాత్రి కురిసిన వర్షంతో రోడ్ల మీదకు వర్షపు నీరు చేరింది. కొత్తపేట, నాగోలు, ఎల్‌బీనగర్, చైతన్యపురి పరిసర ప్రాంతాల్లో ఉన్న కాలనీల రహదారులపై వర్షపునీరు నిలిచింది. దీంతో ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారులపై నీరు చేరడంతో వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వరద నీటిని తొలగించే పనులను చేపట్టారు. వర్షాలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కరెంట్ తీగలకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని అధికారులు సూచించారు.





కంకర తేలి గుంతలమయంగా రోడ్డు



హనుమాన్‌నగర్‌లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు

రోడ్లన్నీ గుంతలమయం

- అర్ధంతరంగా ఆగిన అంతర్గత రోడ్ల నిర్మాణం
- బిల్లులు మంజూరు కావడం లేదంటున్న కాంట్రాక్టర్లు
- గుంతల రోడ్లతో వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



నాగోలు: అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా పలు కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. చేసిన పనులకు బిల్లులు మంజూరు కావడం లేదంటూ ఆయా టెండర్లను పొందిన కాంట్రాక్టర్లు పనులను మధ్యలో వదిలేస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల్లోని రోడ్లు గుంతలమయమై వాహనదారులతోపాటు పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- చిన్నపాటి వర్షం కురిస్తే తమ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందని కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ నాగోలు డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గతంలో కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రజా ప్రతినిధులు రోడ్డు నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు.
- కాంట్రాక్టర్లు కొన్ని రోడ్ల పనులను వేగంగానే ప్రారంభించారు. అయితే కొన్ని నెలలుగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో వివిధ కాలనీల్లో సీసీ రోడ్ల పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలివేశారు. దీంతో కాలనీలో సీసీ రోడ్ల కోసం తీసిన గుంతలు కాస్తా ప్రజల పాలిట ప్రమాదకరంగా మారాయి.
- నాగోలు డివిజన్ హనుమాన్‌నగర్‌లో సంవత్సరం క్రితం సీసీ రోడ్ల నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. మరో రోడ్డులో ఒక లేయర్ వేసి వదిలేశారు. దీంతో వేసిన రోడ్డు పూర్తి కాకపోడం, డ్రైనేజీ పైప్‌లైన్ పూర్తిగా మూసివేయక పోవడంతో కాలనీలో రోడ్డు కంకరతేలి ప్రమాదకరంగా మారింది.
- రోడ్డు కోసం తీసిన గుంతలు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌తో రాత్రి సమయంలో కాలనీలోకి వచ్చే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నారు.
- ఈ విషయంపై కాలనీ సంక్షేమ సంఘం నాయకులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- హనుమాన్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించి మధ్యలో ఆగిపోయిన రోడ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బలాల సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంపై చేపట్టాల్సిన అంశాలకు సంబంధించి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శుక్రవారం పంజేషా హాలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్షించారు. ఎంఐఎం కార్పొరేటర్లు, స్ట్రీట్‌లైట్లు, ఎంటామాలజీ, వెటర్నరీ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. వీధి కుక్కలు, దోమల నివారణ మందు ఫాగింగ్, స్ట్రీట్ లైట్ల నిర్వహణ తదితర అంశాలను ఎమ్మెల్యే చ్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వీధి కుక్కల బారి నుంచి చిన్నారులు, ప్రజలను కాపాడేందుకు వెటర్నరీ విభాగం అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి కుక్కలను పట్టుకుని వాటికి కటుంబ నియంత్ర ఆపరేషన్లు చేయాలన్నారు. వీధి కుక్కల విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని ఎమ్మెల్యే సూచించారు. స్ట్రీట్‌లైట్లకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాలలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. మలక్‌పేటలోని అన్ని ప్రదేశాలలో యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్, ఆయా శాఖల అధికారులు, మజ్లిస్ నాయకులు మహమ్మద్ సైఫుద్దీన్, షేక్ అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

'సిరినిటీ' అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు శశివర్ధన్‌రెడ్డి

లింగోజిగూడ: లింగోజిగూడలోని గ్రేటర్ కమ్యూనిటీ మాధవరం సిరినిటీ అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం క్లబ్ హౌస్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కొట్టం శశివర్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బండారు మోహనమ్మ, ప్రధాన కార్యదర్శిగా తాంధ్ర ప్రవీణ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అన్నం అనిల్‌రెడ్డి, కోశాధికారిగా పెనుగొండ మునివెంకట సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆలంపల్లి రమేష్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు శశివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... పెండింగ్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 23, బెండ 65, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 15. దొండ 40, ఆలు 16, ఉల్లి 16, గోకర 50, దోస 35, సొర 9, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 55, అర్వి 55, మునగ 45, చిలగడదుంప 37, బీట్‌రూట్ 17, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ రూ. 47 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

త్వరలో బీఆర్‌ఎస్ పాలనకు చెక్: బీజేపీ



మలక్‌పేటలో కార్పొరేటర్లు అరుణ, భాగ్యలక్ష్మి తదితరులు

చంపాపేట: రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పాలనకు పాతరేసి తెలంగాణలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమని చంపాపేట కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి ఘన విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం కర్మన్‌ఘాట్ చౌరస్తాలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సదర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ కుటుంబ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున బాణాసంచా కాల్చి అందరికీ స్వీట్లను పంచిపెట్టారు. నాయకులు సుంకరి రమేష్‌గౌడ్, సద్ది సందీప్‌రెడ్డి, కృష్ణగౌడ్, విజేశ్వర్‌రెడ్డి, సందీప్, కృపాకర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, అమిత్, సుమిత్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో...

మన్సూరాబాద్: బీజేపీ బలపరచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడంతో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఎల్‌బీనగర్‌లో సంబరాలను చేసుకున్నారు. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థి విజయం సాధించడం శుభసూచకమన్నారు. కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, రంగ నర్సింహగుప్తా, మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, నాంపల్లి రామేశ్వర్, కృష్ణంరాజు, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిల్కూరి మాధవి, కవితారెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పవన్‌కుమార్ అభినందన...

నాగోలు: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ బలపరచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డిని శుక్రవారం కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కలసి అభినందనలు తెలియజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... తెలంగాణలో మార్పు ప్రారంభమైందని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు సుందర్ నారాయణ, కొత్త తిరుమల్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో...

మలక్‌పేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడం పట్ల మలక్‌పేటలో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి సలీంనగర్‌లో విజయోత్సవాలను నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. నాయకులు మధుకర్, కొంగర ప్రవీణ్, జక్కా మోహన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కొప్పుల దినేష్, వై. సురేందర్, గణేష్, గజానంద్, లక్ష్మారెడ్డి, వినోద్, వరప్రసాద్ పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్ చౌరస్తాలో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తదితరులు



ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని అభినందిస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్



ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

19న పంచాంగ శ్రవణం

వనస్థలిపురం: శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 19న పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉంటుందని వేదభూమి సంస్థ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6.05 గంటలకు వనస్థలిపురంలోని శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మశ్రీ దేవులపల్లి పవనకుమార సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. కార్యక్రమాని హాజరైన వారందరికీ శ్రీశోభకృత్–ఉగాది పంచాంగాన్ని అందించనున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

హయత్‌నగర్: వర్షంలో కరెంటు పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తట్టిఅన్నారంలో నివసించే దేవిడి నరేందర్‌రెడ్డి(50) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గురువారం గ్రామానికి చెందిన ఆకుల ఈశ్వర్ వచ్చి పస్మాములలోని అతన్‌భాయి ఫాంహౌస్‌లోని అశోక్‌కు చెందిన చేపల చెరువు వద్ద పని ఉందని తీసుకెళ్లాడు. పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన నరేందర్‌రెడ్డి కుప్పకూలి పోయాడు. చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వర్షంలో విద్యుత్ పని చేస్తున్న తన సోదరుడికి ఎలాంటి భద్రత చర్యలు తీసుకోకపోవడంతో మృతి చెందాడని... నిర్లక్ష్యంగా పని చేయించిన చేపల చెరువు యజమానిపై చర్యలు తీసుకోవాలని మృతుడి అన్న గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులోకి తేవాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ సచివాలయ నగర్ కాలనీలోని స్విమ్మింగ్ పూల్ నిర్వహణలో నెలకొన్న లోపాలను యుద్ధ ప్రాతిపదికన సరిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. శుక్రవారం ఆయన స్విమ్మింగ్ పూల్‌ను ఆయన పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్‌లోని నీరు బయటకు వెళ్లేందుకు నూతనంగా పైప్‌లైన్, మరో బోరును కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు కటిక అరవిందరెడ్డి, రాంబాబు, సుమంత్, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'లీకేజీ'లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్లక్ష్య వైఖరి కారణంగానే పరీక్ష పత్రాలు లీక్ అయ్యాయని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులు తమ భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారన్నారు. బాధితులకు భరోసాగా నిలిచేందుకు ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లో ఆయన మాట్లాడుతూ... లీకేజీ వ్యహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బోర్డు చైర్మన్‌తో పాటు సభ్యులు రాజీనామా చేయాలన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు నిరాహార దీక్ష ప్రారంభం అవుతుందన్నారు. జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌లు దీక్షలో పాల్గొంటారని తెలిపారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మన్సూరాబాద్: విజయశ్రీ కాలనీలోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటలకు లక్ష్మీనారాయణ హోమం, నిత్య హోమం, ఎదుర్కోలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం లక్ష్మీహయగ్రీవ హోమం, సాయంత్రం 7 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సిరెడ్డి తెలిపారు.



పూజల్లో ఆలయ కమిటీ నాయకులు

వైద్య విద్యార్థినికి చేయూత



శ్రీహర్షకు ఆర్థిక సాయం అందజేస్తున్న చైర్‌పర్సన్ పద్మారెడ్డి

నాగోలు: సేవా రంగంలో రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ ఎప్పుడూ ముందుంటుందని అసోసియేషన్ ఫౌండర్ చైర్ పర్సన్ నూకల పద్మారెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీహర్ష మహబూబ్‌నగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతోంది. శ్రీహర్ష చదువు కోసం రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ తరుపున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ... శ్రీహర్ష తండ్రి ప్రసాద్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారన్నారు. కుమారుడు అంగవైకల్యంతో ఉండగా... ఇద్దరు కుమార్తెలు చదువుల తల్లి సరస్వతీదేవి ముద్దుబిడ్డలన్నారు. ఒక కుమార్తె మెడిసిన్‌లో ఫ్రీ సీట్ సధించగా మరో కుమార్తె భోజరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రీ సీట్ సాధించిందని తెలిపారు. వాటి ఫీజులను భరించే స్తోమత ప్రసాద్‌రెడ్డి లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీ హర్షకు రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ సభ్యులు నందికొండ గీతారెడ్డి, ప్రమీలారెడ్డి, మమతారెడ్డి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

చంపాపేట: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఊపిరి అని పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సి బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ సమన్వయ కర్త ఎస్వీ కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం చంపాపేట డివిజన్ యాదగిరినగర్, మారుతీనగర్, ఎస్‌జీఆర్ కాలనీలో గడప గడపకూ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ నాయకులు ప్రకాష్ ముదిరాజ్, మెట్టు సంజీవరెడ్డి, ఆరె కృష్ణ, ముత్యాల సత్యనారాయణ, బైగళ్ల రవీందర్, ఆనంద్ నాయుడు, వెంకటేష్, వేణు చౌదరి, హేమలత, అలివేలు, శ్రీలలిత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.